# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :105 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 18-06-2024 | పేజీలు:4 వెల: 2.00


## 19న వైకాపా విస్తృతస్థాయి సమావేశం

### పార్టీ నేతలకు దిశానిర్దేశం చేయనున్న జగన్

అమరావతి, : ఈనెల 19న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 19న ఉదయం 10:30గంటలకు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలతో సహా ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులందరికీ ఇప్పటికే ఆహ్వానం పంపారు. నలుగురు ఎంపీలు మినహా పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులకు కూడా ఆహ్వానం పంపించారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పార్టీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన అభ్యర్థులతో జగన్ అధికారికంగా సమావేశం కావడం ఇదే తొలిసారి. వారం రోజుల క్రితం శాసన మండలి సభ్యులతోనూ ఆయన సమావేశమై వారికి దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. అలాగే పార్టీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన అభ్యర్థులతోనూ సమావేశమై తదుపరి కార్యచరణపై వారితో చర్చించనున్నారు.

# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం

## త్వరలోనే జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తాం: మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్,జూన్17 : బీఆర్ఎస్ హయాంలో అస్తవ్యస్థమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 12 ఏళ్ల తర్వాత గ్రూప్ 1 పరీక్షను తామే నిర్వహించామని చెప్పారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని చెప్పారు. పింఛన్ల పెంపులో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీ సీఎం చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలన్న మాజీ మంత్రి హరీశ్ వ్యాఖ్యలకు కౌంటర్ వేశారు. హరీశ్ రావు చంద్రబాబును ఉదాహరణగా తీసుకున్నారంటే ఆయన పరిస్థితి ఏంటో అర్థమవుతుందని విమర్శించారు. తాము తెలంగాణ ప్రజలు ఆలోచనలను అమలు చేస్తాం కానీ.. ఏపీ ఆలోచనలు కాదన్నారు. తాము చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఆశ వర్కర్ల గురించి మాట్లాడే హక్కు హరీష్ కు లేదన్నారు. వాళ్ల హయాంలో ఆశా వర్కర్స్ ను గుర్రాల తో తొక్కించారని విమర్శించారు. త్వరలోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పారు. పెద్దపల్లిలో జరిగిన ఘటనపై విచారణ జరుగుతుందన్నారు శ్రీధర్ బాబు. ఘటన జరగడం దురదృష్టకరమని.. శాంతి భద్రత విషయంలో తమ ప్రభుత్వం సీరియస్ గా ఉందన్నారు. మెదక్‌లో జరిగిన మతఘర్షణల విషయంలో సీరియస్ గా ఉన్నాం.. ఘటన వెనక ఎవరి హస్తం ఉన్నా ఉక్కు పాదంతో అణిచివేస్తామని చెప్పారు.

# బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ,జూన్17 : నల్లగొండ పట్టణంలో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఈద్గాలో ముస్లింసోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ ప్రార్థనల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. బక్రీద్ అంటే త్యాగాలకు ప్రతీక అన్నారు. నల్లగొండ పట్టణంలో గత 30 ఏండ్లుగా హిందూ ముస్లిం అనే తేడా లేకుండా అన్నదమ్ములుగా కలిసి ఉంటున్నారని చెప్పారు. పేద ముస్లింలకు ఇండ్లు కట్టిస్తామని తెలిపారు. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఈద్గాను అభివృద్ధి చేస్తామన్నారు. ముస్లింలకు విద్యారంగంలో ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో చదువుకున్న ముస్లి యువతకు అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. అంతా బాగుండాలని అల్లాను ప్రార్థించానని చెప్పారు. పటిష్ట బందోబస్తుతో శాంతియుతంగా ప్రార్థనలు జరిగేలా చూసిన పోలీసు శాఖను అభినందించారు.

# హత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి అండగా ఉంటామన్న మంత్రి సీతక్క

## గంజాయి, డ్రగ్స్ వల్లనే అత్యాచార కేసులని వ్యాఖ్య



మహబూబాబాద్,జూన్17 : హైదరాబాద్‌లో హత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. మరిపెడ మండలం ఎల్లంపేటలోని బాధిత గిరిజన కుటుంబాన్ని మంత్రి సీతక్క స్వయంగా వెళ్లి ఓదార్చారు. ఈనెల 7న మియాపూర్ నడిగడ్డతండాలో బాలికపై హత్యాచారం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడం, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి సైతం తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. దీంతో తాజాగా మంత్రి సీతక్క బాధితుల స్వగ్రామానికి వెళ్లి వారిని పరామర్శించారు. బాలికలపై అత్యాచారం, హత్యలకు కారణం గంజాయి, డ్రగ్స్ అని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ లోని మియాపూర్ నడిగడ్డ తండాలో జూన్ 7న బాలికపై అత్యాచారం, హత్య జరిగిన సంగతి తెలిసిందే.. దీంతో మహబూబాబాద్ మరిపెడ మండలం ఎల్లంపేటకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు సీతక్క. సీఎం రేవంత్ రెడ్డి గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నారు. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. పోలీసులకు సీఎం రేవంత్ రెడ్డి పూర్తి స్వేచ్చనిచ్చారు. బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది అని భరోసా ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా మర్రి పేడ మండలం లక్ష్మ తండాకు చెందిన నరేష్,శారద దంపతులు కూలి పనుల కోసం 20 రోజుల క్రితం మియాపూర్ పరిధిలోని నడిగడ్డ తండాకు వచ్చి ఉంటున్నారు. జూన్ 7న ఇంటి నుంచి బయటకు వెళ్లిన బానోతు వసంత తిరిగి రాలేదు. పోలీసులు దర్యాప్తు చేయగా.. బాలిక వసంత మిస్సింగ్ అయిన ప్రాంతానికి కిలోమీటర్ల దూరంలో ఆమె మృతదేహం లభ్యమైంది. బాలిక మృతదేహం సగం ఖాళీ ఉంది. పాపను ఎవరో అత్యాచారం చేసి చంపారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మంత్రి వెంట ఎంపి బలరామ్ నాయక్ తదితరులు ఉన్నారు.

# పార్టీ మారుతున్నానంటూ దుష్ప్రచారం ఆపడి మీ వ్యూస్ కోసం ఇంతగా అబద్దాలా: హరీష్ రావు



హైదరాబాద్,జూన్17 : తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడిన ఆయన.. సంచనాల కోసం తనపై మీడియా, సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానల్ లో ఏవేవో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ లోకి, బీజేపీలోకి వెళ్తున్నానని ఏదేదో ప్రచారం చేస్తున్నారు.. దయచేసి ఇలాంటి తంబ్ నెయిల్ పెట్టి మీ లైక్స్ , వ్యూస్ కోసం నాయకుడి క్రెడిబిలిటి దెబ్బతీయొద్దని సూచించారు. ఏదైనా ఉంటే తనను అడిగి రాయాలని సూచించారు. ఇలాంటివి మానుకోకపోతే వారిపై లీగల్ గా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. నిరుద్యోగ యువతి, యువకులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో యువత ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నికల టైమ్ లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రూప్స్ పోస్టులు పెంచాలని అడిగిన కాంగ్రెస్ .. ఇప్పుడు ప్రభుత్వంలో ఉండి ఎందుకు స్పందించడం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని అభ్యర్థులు తమ వద్దకు వచ్చి కోరారని అన్నారు. గ్రూప్స్ పరీక్షలకు మధ్య వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని తెలిపారు.

## అనంతను అన్నిరంగాల్లో అభివృద్ది చేస్తా మంత్రిపయ్యావుల కేశవ్ హామీ

అనంతపురం, : అనంతపురం జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. తాను రాష్ట్రానికి మంత్రిని అయినా.. అనంతపురం జిల్లాకు కూలీనేనని తెలిపారు. తాగు, సాగునీటి కోసం జరిగిన పోరాటాల మధ్య తాను పెరిగానని చెప్పారు. జిల్లా ప్రజలు చూపిస్తున్న అభిమానాన్ని ఎప్పటికీ మరువలేనని అన్నారు. జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మాటిచ్చారు. జిల్లా ప్రజల నమ్మకానికి మించి పని చేస్తానని అన్నారు.ఆర్థిక మంత్రిగా అత్యంత బరువు బాధ్యతలు మోయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ ఖజానాకు సంబంధించి ఇంతవరకు లెక్కలు చూడలేదని అన్నారు.

# బెంగాల్లో ఆగివున్న రైలును ఢీకొన్న గూడ్స్

### కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌కు తీవ్ర ప్రమాదం

### మూడు బోగీలు ధ్వంసం..15మంది మృతి

### సహాయక చర్యలకు ఆదేశించిన సిఎం మమతా, కేంద్రమంత్రి వైష్ణవి అశ్విన్



కోల్‌కతా, :పశ్చిమ బెంగాల్లోని రంగపనీర్ స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ రైలును వెనుక నుంచి వేగంగా వచ్చిన గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ రైలు వెనుక మూడు బోగీలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులు మృతి చెందగా, 60 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అసోంలోని సిల్చార్ నుంచి కోల్‌కతాలోని సీల్దాకు వెళ్తున్న కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ సిలిగురి దాటిన తర్వాత రంగ్‌పనీర్ స్టేషన్ సమీపంలో ప్రమాదానికి గురైందని చెబుతున్నారు. ఈ ప్రమాదంలో రైలు వెనుక భాగంలో ఉన్న మూడు బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో రెండు ప్రయాణీకుల బోగీలు, ఒక పార్శిల్ బోగీ దెబ్బతిన్నట్లు రైల్వేశాఖ నుంచి సమాచారం అందింది. ఈ ఘటనలో మరికొంత మంది గాయపడగా, క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లారు. రెస్క్యూ టీమ్‌లు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. ఈ ప్రమాదం నేపథ్యంలో ఆ ప్రాంతంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించి చీ వేదికగా ఓ పోస్ట్ చేశారు. డార్జిలింగ్ జిల్లాలోని ఫన్సిదేవా ప్రాంతంలో జరిగిన విషాద రైలు ప్రమాదం గురించి తెలుసుకుని షాక్ అయ్యానని తెలిపారు. కాంచనజంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు ఢీకొటింది. ఈ నేపథ్యంలో వైద్యులు, అంబులెన్స్‌లు, విపత్తు బృందాలు రెస్క్యూ, రికవరీ, వైద్య సహాయం కోసం స్థలానికి చేరుకున్నాయని, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారని వెల్లడించారు. వైద్యులు, అంబులెన్స్‌లు, విపత్తు బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు ప్రారంభించినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు. కాంచన్‌జంగా ఉన్న అదే ట్రాక్‌పై వెనుకనుంచి వచ్చిన ఓ గూడ్స్ రైలు బలంగా ఢీ కొట్టింది. దీంతో కాంచన్‌జంగా రైలుకు చెందిన ఓ బోగీ గాల్లోకి లేచింది. ప్రమాద తీవ్రతకు గూడ్స్ రైలు బోగీలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు సైతం పట్టాలు తప్పాయి. ఘటనాస్థలి వద్ద చెల్లాచెదురుగా పడి ఉన్న రైలు బోగీలు చూస్తే ప్రమాద తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో తెలుస్తోంది . ఈ ఘటనలో మృతుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు భావిస్తున్నారు.రెండు రైళ్లు ఢీ కొట్టడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ రూట్‌లో వెళ్లే పలు రైళ్లను అధికారులు దారి మళ్లించారు. మరికొన్నింటిని రద్దు చేశారు. మరోవైపు ఈ ఘటనపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. ఎన్ఎఫ్ఆర్ జోన్‌లో దురదృష్టకర ప్రమాదం జరిగిందన్నారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు చెప్పారు. రైల్వే, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

# ఆగస్టు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు..



### వరుస ఎన్నికలతో రియల్ మార్కెట్‌లో స్తబ్దత! పుంజుకున్నాకే నిర్ణయం తీసుకోవాలని విన్నపం

హైదరాబాద్, : రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి, ఆగస్టు 1 నుంచి అమల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై రియల్‌ఎస్టేట్‌రంగం ప్రముఖులు, మార్కెట్ నిపుణులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవాలని భావించడం సమంజసమే అయినా, ప్రస్తుతం రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం పరిస్థితిని కూడా పరిగణనలోనికి తీసుకోవాలని హితవు చెప్తున్నారు. చార్జీలు పెంచే ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నది. అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు సమావేశం నిర్వహించి, భూముల మార్కెట్ విలువల సవరణపై చర్చించనున్నారు. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, సెజ్‌లు, ఇతర వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువగా ఉండి, భూముల ధరలు క్రమంగా పెరుగుతున్న, తగ్గుతున్న గ్రామాలను గుర్తిస్తారు. జాతీయ, రాష్ట్ర రహదారుల కు సమీపంలో ఉన్న గ్రామాలను ప్రత్యేకంగా పరిగణిస్తారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయేతర భూముల బహిరంగ ధరలను లెకలోకి తీసుకుని మారెట్ విలువను సవరిస్తారు. వ్యవసాయ భూములకు సంబంధించి రెవెన్యూ, పంచాయతీ అధికారుల నుంచి వివరాలు సేకరించి ధరలను సవరిస్తారు. పట్టణ ప్రాంతాల్లో.. వాణిజ్య ప్రాంతాలు, ప్రధాన రహదారులు, కాలనీలు, వసతులు, అంతర్గత సదుపాయాలు, మౌలిక వసతులు వంటివి పరిగణనలోకి తీసుకొని ప్రాంతాలవారీగా విలువలను నిర్ణయిస్తారు. మారెట్ విలువల సవరణను ఈ నెల 23 నాటికి పూర్తి చేస్తారు. ఆ తర్వాత అభ్యంతరాలు ఏమైనా ఉంటే 25వ తేదీ వరకు సమీక్షిస్తారు. ఆ తర్వాత కమిటీ ఆమోదం కోసం పంపుతారు. ఈ నెల 29న కమిటీ ఆమోదం తెలిపిన తర్వాత.. సవరించిన విలువలను జూలై 1న వెబ్‌సైట్‌లో ప్రచురిస్తారు. జూలై 20 వరకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటి ఆధారంగా ధరల్లో ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే చేసి.. జూలై 31న వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఆ మరుసటి రోజు నుంచి.. అంటే ఆగస్టు 1 నుంచి సవరించిన ధరలు అమల్లోకి రానున్నాయి. స్టాంపు డ్యూటీ పెంచుతారా? లేదా? అనేదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. ప్రస్తుతం మార్కెట్ విలువలో స్టాంపు డ్యూటీ 5.5 శాతంగా ఉన్నది. దీనికి ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 0.5%, రిజిస్ట్రేషన్ చార్జీలు 1.5% కలిపి రిజిస్ట్రేషన్ ఫీజు మార్కెట్ విలువలో 7.5 శాతంగా ఉన్నది. **కొంతకాలం ఆగితే నయం:** రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో రియల్‌ఎస్టేట్ రంగంపై ప్రభావం పడే అవకాశం ఉన్నదని వ్యాపారులు, మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో భూముల విలువ బాగా పెరిగినప్పుడో, క్రయవిక్రయాలు జోరుమీద ఉన్నప్పుడో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే పెద్దగా ప్రభావం కనిపించదని చెప్తున్నారు. కానీ, రాష్ట్రంలో గత ఏడాది సెప్టెంబర్ నుంచి వరుసగా ఎన్నికలు, కొత్త ప్రభుత్వాలు, ఎన్నికల కోడ్ వంటి పరిణామాలు, ఇతర కారణాలతో రియల్‌ఎస్టేట్ రంగం స్తబ్దుగా ఉన్నదని అంటున్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది మొదటి రెండు నెలల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య సగటున 23% తగ్గుదల నమోదైందని ఉదహరిస్తున్నారు. గత మూడు నెలల్లో గమనించినా 20% తగ్గుదల ఉన్నదని వివరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పెంపు సరైన నిర్ణయం స్పష్టం చేస్తున్నారు.

సాధారణంగా పిల్లల పై చదువుల కోసం ఆస్తుల విక్రయం, పిల్లల చదువులపై పెట్టుబడి పూర్తయితే కొత్త ఆస్తుల కొనుగోలు, సెలవుల నేపథ్యంలో కుటుంబాలకు ఎక్కువగా తీరిక సమయం దొరకడం తదితర కారణాల వల్ల మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో లావాదేవీలు అత్యధికంగా ఉంటాయని చెప్తున్నారు. ఇలాంటి సమయంలో తిరోగమనం నమోదవడం మంచి సంకేతం కాదని హితవు చెప్తున్నారు. కాబట్టి మార్కెట్‌కు జోష్ వచ్చేలా చేసి, ఆ తర్వాత ధరలు సవరించాలని సూచిస్తున్నారు. లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు.

**ఆదాయ లక్ష్యం.. 21 వేల కోట్లు:** మార్కెట్ ధరలను కనిష్ఠంగా 20%, గరిష్ఠంగా 40% వరకు సవరించే అవకాశం ఉన్నది తెలుస్తున్నది. ఈ నెల 18వ తేదీ నుంచి ఆర్థిక మంత్రి వివిధ విభాగాల అధిపతులతో బడ్జెట్ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పెంచబోయే ధరలకు అనుగుణంగానే అంచనాలు రూపొందించాలని ఆదేశాలు జారీ అయినట్టు తెలిసింది. గత ఆర్థిక సంవత్సరంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రూ.18,500 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఈసారి మార్కెట్ ధరల సవరణ నేపథ్యంలో ఆదాయ లక్ష్యం రూ.21 వేల కోట్ల వరకు ఉండొచ్చని చెప్తున్నారు. నిరుడు రూ.14,295 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది కనీసం రూ.19-20 వేల కోట్ల వరకు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం.

## స్వాతంత్ర సమరయోధుల సేవలు మరువరానివి

కమాన్ పూర్ జూన్ 17.స్వాతంత్ర సమరయోధుల సేవలు మరువరానివని మూస్త్యాల తాజా మాజీ సర్పంచ్ పెద్దపల్లి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు రామగిరి లావణ్య అన్నారు.పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామం లో గ్రామ తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య అధ్వర్యంలో భారత స్వతంత్ర సమరయోదురాలు రాణి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి నీ ఘనంగా నిర్వహించడం జరిగింది ...లావణ్య మాట్లాడుతు ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి 1857 లో ఆంగ్లేయుల పరి పాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వతంత్ర సమరయోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి అని అన్నారు. బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేసి గొప్ప మహిళా సమరయోధురాలు అని లావణ్య అన్నారు భారత దేశం జోన్ ఆఫ్ ఆర్క్ గా ఆమే భారత దేశ చరిత్ర లో గొప్ప వ్యక్తి గా. నిలిచిపోయింది. ఈ తరం మహిళలు ఝాన్సీ లక్ష్మీబాయి ని ఆదర్శంగా తీసుకోవాలని లావణ్య అన్నారు. భారత స్వతంత్ర సమరయోధులు. తిరుమల రామచెంద్రా జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది స్వతంత్ర్య ఉద్యమం లో మద్రాస్ ఉద్యమం లో పాల్గొన్నారు సత్యాగ్రహం ఉద్యమం లో పాల్గొన్నందుకు ఏడాది జైలు శిక్ష అనుభవించారు. సహాయ నిరాకరణ ఉద్యమం లో పాల్గొన్నారు ఎన్నో ఉద్యమాలు చేసి జైలు జీవితం గడిపిన గొప్ప మహానుభావులు అని లావణ్య అన్నారు చిలకమర్తి లక్ష్మీనరసింహం వర్ధంతి నీ ఘనంగా నిర్వహించడం జరిగింది భారత స్వతంత్ర ఉద్యమం లో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో వార్తలు రాసిన గొప్ప పాత్రికేయులు కవి రచయిత అని సర్పంచ్ అన్నారు.